## క్లుప్తంగా

### రాంజీ ఎస్టేట్‌లో భారీ అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న కె.కె.రాజు

**కంచరపాలెం:** జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా లవ్లీ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్నదానం, హోమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. వినాయకుడికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెన్నేటినగర్‌లో..



అన్నప్రసాదం వడ్డిస్తున్న సనపల వరప్రసాద్

**మురళీనగర్:** మురళీనగర్ సమీపంలోని తెన్నేటినగర్‌లో గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. మురళీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఈ కార్యక్రమన్ని ప్రారంభించారు. యూత్ కమిటీ సభ్యులు కుమార్, అబ్బు, అప్పలరాజు, రాంబాబు, సంతోష్ పాల్గొన్నారు.

### మహోన్నత వ్యక్తి అక్కినేని



ఏఎన్నార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోలా గురువులు, అభిమానులు

**తాటిచెట్లపాలెం:** విశాఖపట్నం రైల్వే అక్కినేని యువసేన సభ్యులు.. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, ప్లాటినం జూబ్లీ హీరో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలను పాతపోస్టాఫీసు స్వామి వివేకానంద వృద్ధాశ్రమంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర సీమలో ఏఎన్నార్ మహోన్నతమైన వ్యక్తని, ఎన్నో విజయాలతోపాటు అవార్డులు అందుకున్న గొప్ప కథా నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో బొబ్బిలి సీనియర్ అక్కినేని అభిమాని లంక వాసుదేవరావు, రైల్వే అక్కినేని యువసేన సభ్యులు ఈశ్వరరావు, కె.శ్రీనివాసరావు, డి.వి.సంతోష్, కల్యాణి శ్రీనివాస్, ఏఎన్నార్ అభిమానులు దండల శ్రీను, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

### వార్డు సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టరు మల్లికార్జునకు 49వ వార్డు సమస్యలను వివరిస్తున్న అల్లు శంకరరావు

**మురళీనగర్:** జీవీఎంసీ 49వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు కోరారు. గోపాలపట్నం మండలం పరిధిలోని ప్రజల సమస్యల పరిశీలన కోసం 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న కలెక్టర్‌ను ఆయన కలిసి వార్డులో నెలకొన్న సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. దీనిపై కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సానుకూలంగా స్పందించినట్లు అల్లు శంకరరావు చెప్పారు.



# సాఫీగా.. సురక్షితంగా..

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- బీఆర్‌టీఎస్ రహదారుల్లో వాహనాల వేగానికి కళ్లెం
- స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్, స్టాపర్ల ఏర్పాటు



ఐటీఐ జంక్షన్‌లో జీబ్రా క్రాసింగ్ లైన్స్



బీఆర్‌టీఎస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)



బీఆర్‌టీఎస్ రోడ్డులో నో ఎంట్రీ ఫ్లెక్సీ

**మర్రిపాలెం:** ప్రయాణికులు, వాహన చోదకులు సాఫీగా.. సురక్షితంగా గమ్యాలకు చేరుకోవడానికి కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు.. వాహనాల మితిమీరిన వేగానికి క్లెం వేసేందుకు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్టాపర్లు ఏర్పాటు చేశారు.

**'యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా'ల గుర్తింపు**

కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు ఉన్న కూడళ్లలో 'యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా'లను కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. కరాస జంక్షన్ నుంచి మర్రిపాలెం దుర్గాలమ్మ గుడి, మర్రిపాలెం నుంచి 104 ఏరియా జ్యోతినగర్ వద్ద, కంచరపాలెం జంక్షన్ నుంచి రైతుబజారు వద్ద ఉన్న దుర్గానగర్ కూడలి వద్ద ప్రమాద స్థలాలను గుర్తించి జీవీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారి సహాయంతో మొత్తం 45 స్పీడ్ బ్రేకర్లను అమర్చారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా వైట్ పెయింట్‌తో పెడెస్ట్రియన్ క్రాసింగ్ లైన్స్, క్యాట్ఐస్, రోడ్డు డివైడింగ్ కంటిన్యుయేషన్ లైన్స్, రోడ్డు షోల్డర్ లైన్స్ తదితర వంటివి ఏర్పాటు చేశారు.

**మధ్య రోడ్డులో ప్రయాణం.. ప్రమాదకరం**

బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో కార్లు, బైకులు, ఆటోలకు అనుమతి లేదని నో ఎంట్రీ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ అధిగమిస్తూ వెళ్తే జరిమానాలు విధిస్తామని వాటిపై ఉంచారు. మధ్య మార్గంలో కేవలం బస్సులు, అంబులెన్సులు మాత్రమే ప్రయాణించాలని, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారనే విషయమై ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి కఠిన చర్యలు చేపట్టారు. ఒకవేళ నిబంధనలు మీరి ఏ వాహనదారుడైనా మధ్య రోడ్డులో ప్రయాణిస్తే ట్రాఫిక్ డిసొబిడియన్స్ రూల్ కింద రూ.535, రూ.1,035 జరిమానాలు విధిస్తున్నట్టు అధికారులు తెలిపారు. గత ఐదేళ్లలో ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో ఇటువంటి చర్యలు చేపట్టామని చెబుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను హెచ్చరిస్తూ స్టాపర్లను కూడా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అధికారులు ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

**సురక్షిత ప్రయాణం శ్రేయస్కరం**



వాహన చోదకులు సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తే గమ్యాలకు సురక్షితంగా చేరుకుంటారు. బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో ప్రయాణించడం వల్ల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు మొత్తం 45 స్పీడ్ బ్రేకర్లు వేశాం. కొంచెం ట్రాఫిక్ కంట్రోల్ అయ్యింది. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీలు పర్యవేక్షిస్తున్నారు. వేగాన్ని నియంత్రించి, ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నాం.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

# ప్రజల మనిషి సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 14వ వార్డులో ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కె.కె.రాజు

**సీతమ్మధార:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల మనిషి అని, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 14వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. సీతమ్మధార సచివాలయం (1086111) పరిధి ఏఎస్సార్ నగర్, క్షత్రియ కల్యాణ మండపం ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రజల ఆశీస్సులు ఉండటం వల్లే ఆయన పాలన అద్భుతంగా కొనసాగుతోందని కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాయుడు శ్రీను, నూకరాజు, కిరణ్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, కె.సత్యనారాయణ, ప్రవీణ్ వర్మ, కె.సుశీల, లింగేశ్వరరావు, సీనియర్ నాయకులు షేక్ బీబీ, వెంకటేష్, అశోక్, రాము, నాయుడు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, జీవీఎంసీ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### కొత్త పెన్షన్లు, రైస్ కార్డుల మంజూరు



కొత్త పింఛన్లు అందజేస్తున్న బాణాల శ్రీనివాస్

**సీతంపేట:** జీవీఎంసీ 44వ వార్డులో కొత్తగా 50 మందికి వైఎస్సార్ పెన్షన్లు, 62 మందికి రైస్ కార్డులు మంజూరయ్యాయి. దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలోని సచివాలయంలో బుధవారం జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త పెన్షన్ల పుస్తకాలు, రైస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు 1,200 మందికి వైఎస్సార్ పెన్షన్లు అందుతున్నాయని, కొత్తగా మరో వంద మందికి పెన్షన్లు మంజూరైనట్టు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలంతా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# పోస్టల్ శాఖ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

**సీతంపేట:** జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ ఇచ్చే ప్లాన్స్ ఉన్నాయని తెలిపారు. చిన్న చిన్న మొత్తాల్లో పొదుపు జమ చేసి భవిష్యత్ అవసరాలకు పెద్ద మొత్తంలో అందుకునేలా చాలా రకాల పొదుపు పథకాలు ఉన్నాయన్నారు. తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కె.శ్రీదేవి, మేనేజర్ ఎస్.సంతోష్, ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, పోస్ట్ మాస్టర్ బి.యేసు, సిబ్బంది తపాలా శాఖ అందిస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

### మహిళా జనోద్ధారకుడు గురజాడ



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

**సీతంపేట:** సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల నాగేశ్వరరావు గురజాడ స్మారక ఉపన్యాసం చేశారు. ఆధునిక సాహిత్యానికి గురజాడ దీపం వంటివారని కొనియాడారు. తన కాలం కంటే ముందున్న సాహితీ ద్రష్ట, కవి సంస్కర్త, వైతాళికుడు గురజాడని పేర్కొన్నారు. నా అడుగుజాడ గురజాడ అని సగౌరవంగా శ్రీశ్రీ ప్రకటించారని గుర్తుచేశారు. ఆధునిక మహిళ చరిత్ర తిరగ రాస్తుందని అంటూ స్త్రీ జనోద్ధారణకు నడుం బిగించి రచనలు చేసిన క్రాంతదర్శి గురజాడ అన్నారు. కన్యాశుల్కం నాటకం రూపొంది వందేళ్లు దాటినా అందులోని పాత్రలు, సంభాషణలు, చమత్కారాలు నేటికీ సజీవంగా ఉన్నాయంటే రచయిత గొప్పతనం అర్థం చేసుకోవచ్చన్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, ఎం.విజయగోపాల్, భాగవతుల సత్యనారాయణ మూర్తి , కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, డి.నారాయణాచార్యులు, సుబ్బలక్ష్మి, కె.వి.ఎస్.నరసింహం, రామతాత, పి.వి.ఆర్.కుమార్‌రావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నగర బీసీ సెల్ చైర్మన్‌గా పోలారావు



నూనెల పోలారావుకు నియామక పత్రాన్ని అందిస్తున్న మూల వెంకటరావు

**తాటిచెట్లపాలెం:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఏపీసీసీ) ఓబీసీ విభాగం ఆదేశాలతో నూనెల పోలారావును విశాఖ నగర బీసీ సెల్ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బుధవారం తాటిచెట్లపాలెంలోని పరదేశమ్మ ఆలయంలో పోలారావుకు ఏపీసీసీ(ఓబీసీ) చైర్మన్ మూల వెంకటరావు అందజేశారు. 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు ఈ పదవి లభించినట్లు ఈ సందర్భంగా పోలారావు తెలిపారు. విశాఖలో పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పీసీసీ ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, మూల వెంకటరావు, కాంగ్రెస్ పార్టీ నగర ప్రెసిడెంట్ గొంప గోవిందరాజులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# దేశభక్తి గీతాలపై పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాహితి స్రవంతి ప్రతినిధులు

**మురళీనగర్:** మహాకవి గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాల సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సాహితీ స్రవంతి సంస్థ, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన 'గురజాడ ఆశించిన సమాజం ఫలించిందా?' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలు పి.దిలీప్, ఎస్. ఎల్.ఎస్. వర్ధన్, టి.వైష్ణశ్రీ ,ఈ.రవళి, వై.వందనకు సాహితీ స్రవంతి ప్రతినిధులు, ప్రిన్సిపాల్ వెంకటరమణ బహుమతులను అందజేశారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, సాహితీ స్రవంతి సభ్యులు ఎం.ఆనంద శర్మ, ఆంథోని, వెంకట్, వసంతకుమార్, పి.ఫ్రాన్సిస్, పి.రామారావు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో దీపారాధన

**మురళీనగర్:** మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ సమీపంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కేసీపీ రైస్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. వెయ్యి ప్రమిదలతో శివుడు, శివలింగం ఆకారంలో దీపాలను అమర్చి వెలిగించారు. అందరినీ ఇవి ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కేసీపీ రైస్ ట్రేడర్స్ అధినేత శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నేలకొరిగిన భారీ వృక్షం



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో కూలిన చెట్టు

**సీతమ్మధార:** సీతమ్మధారలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ అటుగా రాకపోకలు సాగించకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. చెట్టు కింద భాగంలోని మట్టి తడిచిపోయి వేళ్లతో సహా పక్కనే ఉన్న పార్కు భవనంపై కూలిపోవడంతో గోడలు పడిపోయాయి. అక్కడి కరెంట్ వైర్లపై చెట్టు పడిపోవడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బుధవారం ఏపీఈపీడీసీఎల్ అధికారుల ఆదేశాల మేరకు చెట్టు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# దుర్గాగణపతిని దర్శించుకున్న మేయర్



సీతంపేటలో పూజలందుకున్న వాణి గణపతి



దుర్గాగణపతి సన్నిధిలో మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ గోవింద్

**సీతంపేట:** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయాన్ని బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి సందర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్‌ను 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఘనంగా సత్కరించి ప్రసాదాలు, జ్ఞాపిక బహూకరించారు.

**వాణి గణపతిగా..:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి మూడో రోజు బుధవారం వాణి గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నమయ్య కీర్తనల సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. గురువారం లక్ష్మీగణపతి అలంకారంలో దర్శనమిస్తారని కార్పొరేటర్ గోవింద్ తెలిపారు.

# ఈవీఎం గణపతికి విశేష పూజలు



లక్ష్మీనారాయణపురంలో ఏర్పాటు చేసిన ఈవీఎం గణపతి

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి లక్ష్మీనారాయణపురంలో యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈవీఎం గణపతిని బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఎలక్షన్ కాన్సెప్ట్‌తో పందిరి, విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్న మూషికాలు, రిటర్నింగ్ అధికారులు, బీఎల్‌వోలుగా మూషికాలు, ఈవీఎం, మెయిన్ యూనిట్ ఇలా ఎన్నికల ప్రక్రియను వివరిస్తూ, ఓటు ఎలా వేయాలో, ఓటు విలువను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఎకో ఫ్రెండ్లీ వినాయక మండపం అందరినీ ఆకర్షిస్తోంది.

**భారీ లడ్డూ బహూకరణ ..** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా ఎకో ఫ్రెండ్లీ వినాయక అనే ప్రత్యేక కార్యక్రమాన్ని 93.5 రెడ్ ఎఫ్ఎం చేపడుతోంది. ఈ ఏడాది సీఎంఆర్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా నగరంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను సందర్శించి పర్యావరణానికి హాని కలిగించని విధంగా పందిళ్లు వేసి, విగ్రహాలను ఏర్పాటు చేసిన వారిలో కొందరిని ఎంపిక చేసి వారికి 25 కేజీల లడ్డూను బహూకరిస్తున్నారు. మొదటి లడ్డూను బుధవారం బాబాయ్–అబ్బాయ్(ప్రదీప్–కృష్ణ)లు మేయర్ హరివెంకటకుమారి చేతుల మీదుగా యువసేవ ఫౌండేషన్ ఫౌండర్ పీలా హరిప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో 93.5 రెడ్ ఎఫ్ఎం ప్రోగ్రామింగ్ హెడ్ సుష్మ, స్థానికులు పాల్గొన్నారు.

# పరమాత్మ తత్వమే గణేశుడు



ప్రవచిస్తున్న తాతా సందీప్‌శర్మ

**సీతంపేట:** గణపతి పూర్ణ తత్వాన్ని తెలియజేసేది గణేశ పురాణమని శతావధాని తాతా సందీప్‌శర్మ అన్నారు. స్థానిక శంకరమఠంలో బుధవారం గణేశ పురాణంపై ఆయన ప్రవచించారు. వ్యాస మహర్షి రచించిన ఉప పురాణాల్లో ప్రసిద్ధమైనది గణేశ పురాణమని తెలిపారు. గణపతినే ప్రధాన దేవతగా దర్శించి పూజించే విధానం, కథలు ఇందులో చెప్పబడ్డాయన్నారు. ఓంకార స్వరూపుడు, బీజాక్షర రూపంలో, శబ్ద బ్రహ్మముగా వ్యక్తమయ్యే పరమాత్మ తత్వమే గణపతి అని ప్రవచించారు.

# ప్రత్యేక ఆకర్షణగా ఇస్రో మండపం



ఇందిరానగర్‌లో వినాయకుడు



రేసపువానిపాలెంలో ఇస్రో మండపం

**సీతమ్మధార:** జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో శ్రీసాయిగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇస్రో మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వరసిద్ధి వినాయక స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఇస్రో చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో ఈ మండపం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఇందిరానగర్‌లో గణపతి ఉత్సవాలు**

**కంచరపాలెం:** జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్–2లో లక్ష్మీగణపతి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక పంచమ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బొట్టా వెంకటరమణ మెమోరియల్ నేతృత్వంలో 12 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం భజన, గరిడి, శుక్రవారం హోమ పూజలు, శనివారం అనుపోత్సవం జరుగుతాయి.

### ● ఆకట్టుకుంటున్న ఆదియోగి గణపతి



ది బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో సీతమ్మధార కేఆర్ఎం కాలనీలో కోయంబత్తూరులోని వెల్లియంగిరి కనుమల్లో వెలసిన ఆదియోగి శివుడి అలంకారంలో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆదియోగి గణపతిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. బుధవారం జరిగిన ప్రత్యేక పూజల్లో శ్రీకార ప్రసాద్, కార్తీక్, సుధాకర్, కమల, గౌరి, భాగ్యలక్ష్మి, దినేష్, గౌరి, మణి, సాయికుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. – సీతమ్మధార